TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 62 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శనివారం | జూన్ 13, 2026

## విదేశీ పర్యటనకు ప్రధాని మోడీ

- ఫ్రాన్స్‌లో జీ-7 సదస్సుకు హాజరు
- ఫ్రాన్స్, స్లోవేకియాలలో పర్యటించనున్న ప్రధానమంత్రి
- 33 ఏళ్ల తర్వాత స్లోవేకియా గడ్డపై అడుగుపెట్టనున్న భారత ప్రధాని
- ద్వైపాక్షిక సంబంధాలు, దక్షిణాది ప్రపంచ అభివృద్ధిపై విస్తృత చర్చలు



2లో..

## వీబీజీ రాంజీ స్కీంపై రాష్ట్ర ప్రభుత్వ నిరసన



2లో..

- 'వీబీజీ రాంజీ' స్కీంపై రాష్ట్ర ప్రభుత్వం నిరసన
- కేంద్రానికి లేఖ రాయనున్న మంత్రి సీతక్క
- నూతన పథకంపై ప్రజాభవన్‌లో అధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష
- పంట సీజన్‌లో 60 రోజుల బ్రేక్ నిబంధనను తొలగించాలి
- కేబినెట్ భేటీ తర్వాతే తుది నిర్ణయం
- మంత్రి సీతక్క వెల్లడి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్ర ప్రభుత్వం వచ్చే జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయాలని తలపెట్టిన 'వీబీజీ రాంజీ' స్కీం పట్ల తమ ప్రభుత్వం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ నూతన పథకానికి వ్యతిరేకంగా ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేశామని గుర్తుచేసిన ఆమె.. తమ నిరసనను తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఈ లేఖలో పొందుపరచాల్సిన ప్రధానాంశాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు తదితర ఉన్నతాధికారులతో మంత్రి సీతక్క సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. కేంద్రం ప్రతిపాదించిన నూతన విధానంలోని లోపాలను ఆమె ఎండగట్టారు. "వ్యవసాయ సీజన్‌లో ఉపాధి పనులకు 60 రోజుల పాటు బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్ సరైంది కాదు. పంటల సీజన్‌లోనే వర్షాలు విస్తారంగా కురుస్తాయి. ఆ సమయంలోనే ఉపాధి హామీ ద్వారా వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతాం. ఇప్పుడు 60 రోజులు బ్రేక్ ఇస్తే మొక్కలు నాటడం ఆగిపోతుంది. ఇది కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్‌కే విరుద్ధం" అని వివరించారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంట సీజన్ 60 రోజులు

## షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీస్

- మహిళలను కించపరిచేలా మాట్లాడారనే ఆరోపణలపై హైకమాండ్ సీరియస్
- పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌పై వ్యాఖ్యలు..
- సోషల్ మీడియాలో ఆడియో వైరల్
- కామారెడ్డి కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరు..
- పోలీసులకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఫిర్యాదు



2లో..

## సిరిసిల్ల 'మన బడి - మన బాధ్యత'లో ప్రోటోకాల్ రచ్చ

- ఎస్పీ రాకపోవడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం
- 'నేనేం సాధారణ కార్యకర్తను కాను.. కేంద్రమంత్రిని'
- మీ ఎస్పీకి బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఎందుకని డీఎస్పీపై ప్రశ్నల వర్షం
- అధికార యంత్రాంగం పక్షపాతం లేకుండా పనిచేయాలని హితవు



2లో..

## సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంచాలి



2లో..

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఎంపీ వంశీకృష్ణ సవాల్
- కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే పెన్షన్ పెంచి చూపించాలి
- పార్లమెంట్ వేదికగా సింగరేణి హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తా
- శ్రీరాంపూర్‌లో కారుణ్య నియామక పత్రాల పంపిణీ చేసిన పెద్దపల్లి ఎంపీ

# 'వీబీజీ రాంజీ' స్కీంపై రాష్ట్ర ప్రభుత్వం నిరసన

- కేంద్రానికి లేఖ రాయనున్న మంత్రి సీతక్క
- నూతన పథకంపై ప్రజాభవన్‌లో అధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష
- పంట సీజన్‌లో 60 రోజుల బ్రేక్ నిబంధనను తొలగించాలి
- కేబినెట్ భేటీ తర్వాతే తుది నిర్ణయం
- మంత్రి సీతక్క వెల్లడి



**(మొదటి పేజీ తర్వాత..)** కూడా ఉండదని, పనులు మొదలుపెట్టాక మధ్యలో బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా, నార్మెటివ్ పద్ధతిలో పనిదినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలంటే నూతన స్కీంను అమలు చేయక తప్పదని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు ఇందుకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ప్రస్తుత విధానం నుండి ఒక్కసారిగా నూతన చట్టంలోకి మారడం కష్టమని, అందుకే రాష్ట్రాలకు వెసులుబాటు ఇస్తూ ఈ చట్టాన్ని వాయిదా వేయాలని కోరారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఎలాంటి నష్టం జరగకుండా, ఆ నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున భర్తీ చేసేందుకు ముసాయిదా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జరిగే తదుపరి కేబినెట్ భేటీలో ఈ నూతన పథకం అమలుపై సుదీర్ఘంగా చర్చించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# సిరిసిల్ల 'మన బడి – మన బాధ్యత'లో ప్రోటోకాల్ రచ్చ

- ఎస్పీ రాకపోవడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం
- 'నేనేం సాధారణ కార్యకర్తను కాను.. కేంద్రమంత్రిని'
- మీ ఎస్పీకి బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఎందుకని డీఎస్పీపై ప్రశ్నల వర్షం
- అధికార యంత్రాంగం పక్షపాతం లేకుండా పనిచేయాలని హితవు



**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన "మన బడి – మన బాధ్యత" కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం రాజుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతే తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో శనివారం జరిగిన ఈ సేవా కార్యక్రమానికి కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయితే ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ హాజరు కాకపోవడంపై బండి సంజయ్ తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. సదరు అధికారిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్థానంలో కేవలం డీఎస్పీ మాత్రమే అందుబాటులో ఉండటంతో కేంద్రమంత్రి నేరుగా ఆయననే ప్రశ్నించారు. "ఎస్పీ ఎందుకు రాలేదు? నేనేం సాధారణ రాజకీయ కార్యకర్తను కాను, కేంద్రమంత్రిగా ఒక కార్యక్రమానికి వస్తున్నప్పుడు జిల్లా ప్రధాన పోలీస్ అధికారి హాజరు కావాల్సిన బాధ్యత లేదా?" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీని ఉద్దేశించి మాట్లాడుతూ.. "మీ ఎస్పీకి బీఆర్ఎస్ పార్టీపై అంత ప్రేమ ఎందుకు? అంతగా ఇష్టముంటే అవసరమైతే ఆ పార్టీలోనే చేరమనండి" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అధికార యంత్రాంగం ఏ పార్టీకి కొమ్ముకాయకుండా, రాజకీయ పక్షపాతం లేకుండా నిష్పక్షపాతంగా పనిచేయాలని కేంద్రమంత్రి బండి సంజయ్ హితవు పలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక కార్యక్రమాలకు అధికారులు ప్రోటోకాల్ ప్రకారం తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఒక కేంద్రమంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగానే జిల్లా ఎస్పీని టార్గెట్ చేస్తూ, గత పాలకుల పట్ల ప్రేమ ఉందంటూ చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ, అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంచాలి

**మంచిర్యాల, వాయిస్ ఆఫ్ వంద భారత్ :** సింగరేణి కార్మికులపై కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే... రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను తక్షణమే పెంచి చూపించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని తమ గుండెల్లో మోసి, ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమాన్ని ముందుకు నడిపిన నిజమైన వీరులు సింగరేణి కార్మికులేనని ఆయన కొనియాడారు. శనివారం మంచిర్యాల వేదికగా శ్రీరాంపూర్ సింగరేణి ఏరియా ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'సింగరేణి కారుణ్య నియామకాల పత్రాల పంపిణీ' మహోత్సవంలో ఎంపీ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపెండెంట్ ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు ఆయన నియామక పత్రాలను అందజేసి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులు అనగానే దేశంలో ఎవరికైనా ముందుగా గుర్తొచ్చే మహోన్నత వ్యక్తి దివంగత నేత 'కాకా' వెంకటస్వామి అని గుర్తుచేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో రూ. 150 కోట్ల భారీ వ్యయంతో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సింగరేణి ఉద్యోగులకు ఐటీ పర్క్స్ నుంచి తక్షణమే మినహాయింపు ఇవ్వాలని, అలాగే సంస్థలో సుదీర్ఘకాలంగా నలుగుతున్న మారుపేర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీ డిమాండ్ చేశారు. కార్మికులు సుఖంగా, సంతోషంగా ఉంటేనే సంస్థ బాగుంటుందని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపు కోసం ఇప్పటికే పార్లమెంట్‌లో గళం విప్పానని.. రాబోయే రోజుల్లోనూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా అలుపెరగని పోరాటం చేస్తానని ఎంపీ వంశీకృష్ణ ధీమా వ్యక్తం చేశారు.

# విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ

- ఫ్రాన్స్‌లో జీ-7 సదస్సుకు హాజరు
- ఫ్రాన్స్, స్లోవేకియాలలో పర్యటించనున్న ప్రధానమంత్రి
- 33 ఏళ్ల తర్వాత స్లోవేకియా గడ్డపై అడుగుపెట్టనున్న భారత ప్రధాని
- ద్వైపాక్షిక సంబంధాలు, దక్షిణాది ప్రపంచ అభివృద్ధిపై విస్తృత చర్చలు

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఉదయం విదేశీ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. తన పర్యటనలో భాగంగా ఆయన స్లోవేకియా, ఫ్రాన్స్ దేశాలను సందర్శించనున్నారు. ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యూహాత్మక సంబంధాలపై చర్చలు జరపడంతో పాటు ఫ్రాన్స్‌లో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక జీ–7 దేశాల సదస్సులో ప్రధాని పాల్గొననున్నారు. న్యూఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో పర్యటనకు తరలివెళ్లారు. గత 1993 తర్వాత భారత దేశ ప్రధానమంత్రి ఒకరు స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ నెల 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో అధికారికంగా పర్యటిస్తారు. అక్కడ ఆ దేశ అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రిని, ప్రధాని రాబర్ట్ ఫికోలతో మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారం, పెట్టుబడులు, అంతర్జాతీయ అంశాలపై చర్చించి పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. స్లోవేకియా పర్యటన ముగించుకుని ప్రధాని మోదీ ఫ్రాన్స్ చేరుకుంటారు. ఈ నెల 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని 'ఈవియన్' నగరంలో ఆయన బస చేయనున్నారు. అక్కడ జరిగే జీ–7 దేశాల శిఖరాగ్ర సదస్సుకు మోదీ హాజరవుతారు. ఈ సదస్సు వేదికగా ప్రపంచ దేశాధినేతలతో ప్రధాని దౌత్యపరమైన భేటీలు నిర్వహిస్తారు. ముఖ్యంగా అంతర్జాతీయ వేదికలపై దక్షిణాది ప్రపంచం (గ్లోబల్ సౌత్) ఎదుర్కొంటున్న సవాళ్లు, అభివృద్ధి అవకాశాల గురించి వివిధ దేశాల నేతలతో చర్చిస్తానని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. జీ–7 సదస్సు అనంతరం, జూన్ 18వ తేదీన ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ సాంకేతిక సదస్సు 'వివాటెక్ 2026'లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతికత, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల రంగంలో వస్తున్న మార్పులపై ఈ సదస్సులో ప్రధాని ప్రసంగించనున్నారు.

# షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీస్

- మహిళలను కించపరిచేలా మాట్లాడారనే ఆరోపణలపై హైకమాండ్ సీరియస్
- పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌పై వ్యాఖ్యలు..
- సోషల్ మీడియాలో ఆడియో వైరల్
- కామారెడ్డి కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరు..
- పోలీసులకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఫిర్యాదు



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. పార్టీ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీపై అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళలను కించపరిచేలా ఆయన మాట్లాడారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఏఐసీసీ క్రమశిక్షణా సంఘం ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించడంపై వివరణ ఇవ్వాలని అధిష్ఠానం ఆదేశించింది. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక ఆడియో క్లిప్ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఆ ఆడియోలో షబ్బీర్ అలీ.. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు కొందరు మహిళా నాయకులను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కాంగ్రెస్ పెద్దలు.. పార్టీ అంతర్గత విషయాలను పబ్లిక్‌లోకి తీసుకురావడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ షబ్బీర్ అలీకి నోటీసులు పంపారు. ఈ పరిణామాల నేపథ్యంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇక్కడ చాలా కాలంగా నడుస్తున్న షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గాల మధ్య విభేదాలు ఇప్పుడు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇదిలా ఉండగా, సొంత పార్టీకి చెందిన కొందరు నేతలు తనపై కావాలనే విమర్శలు, దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులను ఆశ్రయించారు. సోషల్ మీడియా వేదికగా తనపై తప్పుడు ప్రచారం చేస్తూ, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వారిపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. అధిష్ఠానం జారీ చేసిన నోటీసులు, పరస్పర ఆరోపణలు, పోలీస్ ఫిర్యాదులతో ప్రస్తుతం కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.


వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శనివారం, జూన్ 13, 2026

# ఉమామహేశ్వర క్షేత్రంలో భారీ వర్షం



- పరవళ్లు తొక్కుతున్న జలపాతం
- కనువిందు చేస్తున్న నల్లమల ప్రకృతి రమణీయత
- కొండచర్యలు విరిగిపడే ప్రమాదం..
- భక్తులు అప్రమత్తంగా ఉండాలి
- ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావు సూచన

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామ సమీపంలోని ప్రసిద్ధ నల్లమల పుణ్యక్షేత్రం ఉమామహేశ్వరంలో తొలకరి వానలు పలకరించాయి. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొండపై నుండి జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. నింగి నుండి భూమికి దిగివస్తున్నట్లుగా దూకుతున్న జలధారలు ఆహ్లాదభరిత వాతావరణాన్ని సృష్టిస్తూ భక్తులను, పర్యాటకులను ఎంతగానో కనువిందు చేస్తున్నాయి. ఈ ప్రకృతి రమణీయత వీక్షించడం క్షేత్రానికి వచ్చే భక్తులకు సరికొత్త అనుభూతిని ఇస్తోంది. జలపాతం ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ఆలయ అధికారులు భక్తులకు పలు జాగ్రత్తలు సూచించారు. కొండపై నుంచి భారీగా నీరు దూకుతుండటం వల్ల కొండచర్యలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. క్షేత్రానికి వచ్చే భక్తులు, సందర్శకులు జలపాతం వద్దకు వెళ్లేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావు కోరారు. ఎవరూ కూడా ప్రమాదకరమైన ప్రదేశాల్లోకి వెళ్లవద్దని, ఆలయ సిబ్బంది, భద్రతా సిబ్బంది సూచనలను పాటించి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



# జీవన్ రెడ్డి వ్యాఖ్యలకు వైఎస్సార్ ఆత్మ ఘోషిస్తుంది

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కేటీఆర్, బీఆర్ఎస్ నేతలవి అబద్ధాల రాజకీయాలు
- రాబోయే ఎన్నికల్లో వేములవాడ, సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బీఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆత్మ ఘోషిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. శనివారం వేములవాడ పట్టణంలో ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నేత జీవన్ రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వేములవాడలో బీఆర్ఎస్ నిర్వహించిన 'సర్' సభ కేవలం వాస్తవాలను వక్రీకరించి, ప్రజలను తప్పుదోవ పట్టించే అబద్ధాల ప్రచార వేదికగా మారిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ నాయకత్వం ఎప్పుడూ అబద్ధాలతోనే రాజకీయ మనుగడ సాగించిందని, అందుకే ప్రజలు వాస్తవాలు గ్రహించి 2023లో వారిని అధికారానికి దూరం చేశారని ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు. "కల్వకుంట్ల కుటుంబం మాత్రమే అబద్ధాలు ఆడుతుందనుకుంటే, ఇప్పుడు వారితో జీవన్ రెడ్డి కూడా చేతులు కలపడం దురదృష్టకరం. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి అన్ని రాజకీయ అవకాశాలు కల్పించింది. కానీ, ఒకప్పుడు ఎవరినైతే తీవ్రంగా విమర్శించారో, ఇప్పుడు వారిని ప్రశంసించడం ఆయన రాజకీయ అవకాశవాదానికి నిదర్శనం" అని విమర్శించారు. వరద కాలువను కేసీఆర్ ఆలోచనగా చెప్పడం చరిత్రను వక్రీకరించడమేనని విప్ ఆది శ్రీనివాస్ దుయ్యబట్టారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చొరవతోనే వరద కాలువ నిర్మాణం జరిగిందని, 2012లోనే ఎస్ఆర్ఎస్పీ ద్వారా ఆ కాలువలోకి నీటిని తీసుకువచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వేములవాడకు నీటిని అందించే కాలువల కోసం 2005లో వైఎస్సార్ ప్రభుత్వం రూ.1,737 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఫాజుల్‌నగర్ ప్రాజెక్టు, రుద్రంగి నాగారం చెరువుల అభివృద్ధి కూడా కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని స్పష్టం చేశారు. 2014లో కేవలం రూ.75 వేల కోట్ల అప్పులతో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్‌కు అప్పగిస్తే, పదేళ్లలో దాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ, జూరాల, ఎల్లంపల్లి లాంటి ఎన్నో ప్రాజెక్టులు కట్టామని, కానీ కాళేశ్వరం ప్రాజెక్టును గొప్పగా చెప్పుకున్న బీఆర్ఎస్, అది నేడు కుంగిపోవడానికి కారణమైన అవినీతిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకే ప్రస్తుతం ప్రభుత్వం మరమ్మతుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం ఆర్థికంగా దివాళా తీయించినా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధిని ఎక్కడా ఆపకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని విప్ స్పష్టం చేశారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే రాజన్న ఆలయ అభివృద్ధి, పట్టణ రోడ్ల విస్తరణ, వంతెనల నిర్మాణం, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయన్నారు. బీఆర్ఎస్ సభలోని అసత్యాలను ప్రజలు నమ్మవద్దని, కేటీఆర్‌కు అధికారం కోల్పోయాకే ప్రజలు గుర్తొస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆది శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

# రైతు బంధును బంద్ చేసి 'రాహుల్ బంధు' తెచ్చింది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా
- సర్ ప్రక్రియపై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి
- వేములవాడలో చల్మెడ గెలుపు ఖాయం..
- సోషల్ మీడియా ద్వారా వైఫల్యాలను ఎండగట్టండి
- నియోజకవర్గ కార్యకర్తల సమ్మేళనంలో కేటీఆర్




**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభివృద్ధి చేయడం చేతకాక కేసీఆర్ ప్రభుత్వంపై ఏడుస్తున్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు.. నువ్వు చేసింది ఏంటి? ఉన్న రైతు బంధును బంద్ చేసి కొత్తగా రాహుల్ బంధును తెచ్చారు" అని ఆయన ఎద్దేవా చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి ప్రవీణ్, తుల ఉమలతో కలిసి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. జూన్ 25 నుంచి జూలై 25 లోపు దేశవ్యాప్తంగా జరిగే ఓటర్ల పరిశీలన (సర్) ప్రక్రియ అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. "ఇంటింటికి వచ్చే అధికారులు 2002, 2025 ఓటర్ల జాబితాలను పక్కనబెట్టి ఫ్యామిలీ మ్యాపింగ్ చేస్తారు. చనిపోయిన వారి ఓట్లతో పాటు, రెండు చోట్ల ఓట్లు ఉన్నా తొలగిస్తారు. కాబట్టి బీఆర్ఎస్ బూత్ కార్యకర్తలు ప్రతి ఇల్లూ తిరిగి, మన వాళ్ల ఓట్లు అక్రమంగా తొలగిపోకుండా కాపాడుకోవాలి. వేములవాడలో చల్మెడ లక్ష్మీనరసింహారావు గెలుపు పక్కా.. కానీ సర్ లో మన ఓట్లు పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది" అని పిలుపునిచ్చారు. "కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే భయపడాల్సిన అవసరం లేదు. పీకేది ఏమీ లేదు.. మీ వెనుక నేను, చల్మెడ లక్ష్మీనరసింహారావు ఉన్నాం. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం" అని కేటీఆర్ కార్యకర్తల్లో ధైర్యం నింపారు. ఇకపై తాను వేములవాడపై ప్రత్యేక దృష్టి పెడతానని, ప్రతి కార్యకర్త దగ్గరకు స్వయంగా వస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా ప్రారంభించబోతున్నట్లు వెల్లడించారు. రేవంత్ సర్కారు వ్యవసాయం, విద్యా, వైద్య రంగాలలో ప్రజలను ఎలా మోసం చేసిందనే అంశాలపై త్వరలోనే పార్టీ ఆధ్వర్యంలో విస్తృత సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుత యువత ఎక్కువగా సోషల్ మీడియా ఫాలో అవుతున్నారని, కాబట్టి కార్యకర్తలంతా సామాజిక మాధ్యమాలను అస్త్రంగా వాడుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలని పిలుపునిచ్చారు. పూర్వం కేసీఆర్ వచ్చాకే రూ. 200 ఉన్న పెన్షన్ రూ. 2,000 అయిందని, ఆనాటి అభివృద్ధిని, నేటి వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.

# లింగాల మండల ఉపసర్పంచుల సంఘం ఎన్నిక..

- అధ్యక్షుడిగా నాయకప్ప వీరస్వామి

**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలో శనివారం మండల ఉపసర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా లింగాల డిప్యూటీ సర్పంచ్ నాయకప్ప వీరస్వామి ఎన్నికయ్యారు. అలాగే గౌరవాధ్యక్షుడిగా కొత్తకుంటపల్లి డిప్యూటీ సర్పంచ్ బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా కేసీ తండా డిప్యూటీ సర్పంచ్ మాధవనేని శేఖరచారి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఉపసర్పంచుల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు వారణాసి శ్రీనివాసులు, అచ్చంపేట తాలూకా అధ్యక్షులు మాదంశెట్టి తిరుపతయ్యల సమక్షంలో ఈ ఎన్నిక ప్రక్రియ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు మండలంలోని డిప్యూటీ సర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి, ఉపసర్పంచుల రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనకై రాష్ట్ర అధ్యక్షుల పిలుపు మేరకు కలిసికట్టుగా పోరాడుతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పంచాయతీల అభివృద్ధిలో తమ వంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన డిప్యూటీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి వారు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## 25శాతం ఉచిత సీట్ల రిజర్వేషన్ రాజ్యాంగ హక్కు

- ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి
- ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులుఆంజనేయులు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయించడం ప్రభుత్వాల దయాదాక్షిణ్యం కాదని, అది పేద విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కు అని ఎమ్మార్పీఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు ఏడెల్లి ఆంజనేయులు మాదిగ స్పష్టం చేశారు. “విద్య అనేది ధనికుల సొత్తు కాదు… పేదల హక్కు” అని ఆయన పేర్కొన్నారు. శనివారం అచ్చంపేటలో నిర్వహించిన ఒక సమావేశంలో ఆంజనేయులు మాదిగ మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం స్పష్టంగా చెబుతున్నప్పటికీ, నేటికీ అనేక కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ నిబంధనలను బేఖాతరు చేస్తున్నాయని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం పేద పిల్లలకు సీట్లు ఇవ్వకుండా వేలాది మందిని నాణ్యమైన విద్యకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హక్కును కాలరాస్తూ పేద పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న విద్యాసంస్థలు, అధికారులు, పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్యను దూరం చేయడం అంటే వారి భవిష్యత్తును చీకటిలోకి నెట్టడమేనని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రమత్తు వీడి వెంటనే జోక్యం చేసుకోవాలని, ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత రిజర్వేషన్‌ను వంద శాతం అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ సీట్లు కేటాయించని పాఠశాలల గుర్తింపును రద్దు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల విద్యా హక్కుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి ఉచిత సీట్ల ప్రక్రియను పారదర్శకంగా అమలు చేయకపోతే, పేద విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆంజనేయులు మాదిగ హెచ్చరించారు.

## అచ్చంపేట ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

- 25 నుంచి నాలుగో విడత మెగా సర్జికల్ క్యాంప్
- రోగులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆదేశం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే, ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పష్టం చేశారు. శనివారం అచ్చంపేట ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బంది హాజరు శాతాన్ని, వారి పనితీరును సమీక్షించి సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఆసుపత్రి తనిఖీ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ‘నాలుగో విడత మెగా సర్జికల్ క్యాంపు’ను విజయవంతం చేయాలని డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందికి సూచించారు. ఈ క్యాంపులో శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వెనుకబడిన నల్లమల ప్రాంతంతో పాటు అచ్చంపేట పరిసర గ్రామాల్లోని పేద ప్రజలు ఈ మెగా సర్జికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. నిరుపేదలకు ఉచితంగా నాణ్యమైన శస్త్రచికిత్సలు అందించేందుకు వైద్య బృందాలు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ తారా సింగ్, డాక్టర్ మహేష్, ప్రతీప్ రాజ్, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.





## కనగర్తిలో ‘మన బడి – మన బాధ్యత’




- పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసిన బీజేపీ శ్రేణులు

**ఇల్లందకుంట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రధాని నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సేవా సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం ఇల్లందకుంట మండలంలోని కనగర్తి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో “మన బడి – మన బాధ్యత” కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను, మైదానాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వయంగా ఊడ్చి, శుభ్రపరిచారు. అనంతరం మట్ట పవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వాటి ప్రగతికి తోడ్పడాలని కోరారు. ప్రధాని మోదీ సేవాభావం, సుపరిపాలన స్ఫూర్తితో ఇలాంటి సామాజిక హిత కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. గత విద్యా సంవత్సరంలో లాగే ఈ ఏడాది కూడా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పదవ తరగతి విద్యార్థులందరికీ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా ఒకే రోజు భారీ ఎత్తున సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు పవన్ రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమంలో బీజేపీ బూత్ అధ్యక్షులు ఉప్పుల శ్రీనివాసరెడ్డి, బండి సాంబరాజు, బచ్చల రాజమహేందర్, కంచం రాజయ్య, మట్ట అరవింద్ రెడ్డి, మాడిజోడి రవి, సామాను రామారావు, మల్లయ్య తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చౌటపల్లి వాగు ఉధృతి

- నిలిచిన రాకపోకలు..
- బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అచ్చంపేట మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని చౌటపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు ప్రయాణాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలు బంద్ అయిన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శనివారం తక్షణమే చౌటపల్లి బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. గ్రామ ప్రజలతో కలిసి వరద ఉధృతిని, బ్రిడ్జి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ప్రజలకు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, అత్యవసరమైతే తప్ప వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. చౌటపల్లి గ్రామ ప్రజల శాశ్వత రవాణా ఇబ్బందులను తొలగించేందుకు ఇక్కడ ‘హైలెవెల్ వంతెన’ నిర్మించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఆయన ఘటనాస్థలి నుంచే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో ఫోన్లో మాట్లాడారు. ఇక్కడి పరిస్థితిని వివరించి హైలెవెల్ వంతెన మంజూరు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క.. వంతెన నిర్మాణానికి సంబంధించిన పూర్తి ప్రణాళికలు సిద్ధం చేసి వెంటనే పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



